కథ

# కానుక

-కిరణ్‌బాల

సాంబయ్యా వయసు డెబ్భై యేళ్ళు. వృత్తిరీత్యా వడ్రంగి. ఆ వూళ్ళో ఏవో ఒకటీ రెండు కొత్తగా కట్టిన ఇళ్ళు తప్ప పాత ఇండ్లన్నీ సాంబయ్యా కట్టినవే!

ఒకప్పుడు సాంబయ్యా పేరుమోసిన వడ్రంగి. అతడి చేతికింద పదిమంది పనివాళ్ళుండేవారు.

గ్రామ కరణం, సర్పంచ్‌లాంటి పెద్దలు - తలుపులూ, అలమారాలూ, కిటికీలు వంటి అన్ని పనుల్లోనూ సాంబయ్యా చేయి ఉండాలని పట్టుబట్టేవారు.

ఒక్కోసారి ఊపిరిసలపని వృత్తిపనితో సాంబయ్య విసిగిపోయేవాడు. శిష్యుల్ని ఎందర్ని తయ్యారుచేసినా మళ్ళీ సాంబయ్య గిరాకీ సాంబయ్యకు పెరుగుతూనే ఉంటుంది. కానీ పిచ్చి సాంబయ్య! 'పైసా' కూడబెట్టటం ఎరగడు. ఒక్కగానొక్క కూతురికీ పెళ్ళిచేసి, ఉన్న సొమ్మేదన్నా ఉంటే అల్లుడి పరం చేశాడు. ఇంక ముసల్దీ తానూ బిక్కు బిక్కుమంటూ పడుంటున్నారు ఇంట్లో అందరికీ ఇళ్ళు కట్టించిన సాంబయ్య తనకి మాత్రం ఆ సగం కూలిన పాతకొంపనే ఉంచుకున్నాడు.



కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు కదా! ఆధునీకరణ అన్నిరంగాల్లోనూ చోటుచేసుకుంటుందాయె. పట్టణాలను చూసి గ్రామాలూ 'పులినిచూసి నక్కవాత' అన్నట్టుగా వంకర్లుపోతున్నాయి. పట్నాల చందాలు చూసి తమకీ అవ్వే కావాలని వువ్విళ్ళూరుతున్న కుర్రకారు 'పాత ఒక రోత' అని ఈసడిస్తున్నారు.

కొత్తగా అవూళ్ళో ఇళ్ళు కట్టటం తగ్గిపోయింది. పట్నాల్లోనే సెటిల్ అయిపోయే ఉద్దేశ్యాలున్న ఆధునీకులు కన్నతల్లిలాంటి పల్లెల్ని మర్చిపోతున్నారు. ఇక సాంబయ్య లాంటి వారిని ఆదరించే వారెవ్వరు?

బతుకు తెరువు ఎట్లాని సాంబయ్యకి బెంగపట్టుకొంది. ఇల్లాలికి ఎడతెరిపిలేని దగ్గు. దాన్ని దవాఖానకి తీసుకెళ్ళాలయ్యే!

ఉన్నట్టుండి ఓరోజు సాంబయ్యకి మెరుపులా ఒక ఆలోచన మెరిసింది.

వయసులో ఉన్నప్పుడుతాను వంటచేయటంలో నలభీముల్ని తలపించేవాడు. ఆ కళని మళ్ళీ ఇప్పుడు ప్రదర్శిస్తేనో! ఏదో తన పొట్టకూటికి సరిపోయే నాలుగు డబ్బులు చేతిలో ఆడితే చాలు.

పెళ్ళానికి చెపితే- 'ఈ వయసులో నీకు చాతనవుద్దా?' అంది. 'నీకోసం ఏమైనా చేత్తానే' - అన్నాడు సాంబయ్య.

సాంబయ్య వృద్ధుడైనా జబ్బపుష్టిగలవాడు. అసలు వయసుకంటే ఓ పదీ, పన్నెండేళ్ళు తక్కువే కనపడ్తాడు.

సర్పంచిగారితో చెప్పించుకొని ఓ రెండు మూడు పెళ్ళిళ్ళకి వంటలు చేశాడు. పెద్ద పెద్ద 'అండాలు' ఓ పట్టాన దించలేకపోయేవాడు సాంబయ్య. అయితే ఎలాగో ఓ ఇద్దరు మనుషులు వంట దగ్గర ఉండేవారు కనుక పెద్ద కష్టం అయ్యేది కాదు.

అలా అలా సాంబయ్య మళ్ళీ అందరికీ 'తలలో నాలుక' అయిపోయాడు.

ఆ ఊళ్ళో యువకులు వృధాగా తిరుగుతుంటే 'సాంబయ్యని చూసి నేర్చుకోండిరా' - అని వాళ్ళ తల్లిదండ్రులు చేత అనిపించుకునేంత ఎత్తుకి ఎదిగాడు.

అయినా సాంబయ్యకి వృత్తివిద్య మీదున్న మక్కువ మాత్రం పోలేదు.

ఇంతలో ఓరోజు మాజీ కరణంగారు పిలుస్తున్నారని కబురొచ్చింది సాంబయ్యకి. హుటాహుటిని ఉత్తరీయాన్ని దులుపుకొని వెళ్ళాడు.

వాళ్ళిద్దరూ దాదాపు సమ వయస్కులే! 'ఏరా సాంబా, అంతా బాగేనా? పది దినాల ముందు కిష్టారెడ్డిగారి కొడుకు పెళ్ళిలో కనబడ్డవంటే, మల్లా పత్తాలేవ్. గౌరమ్మ మంచిగుందా?'

కుశల పరామర్శ చేశారు మాజీ కరణంగారు. సాంబయ్య కష్టమూ, సుఖమూ వెళ్ళబోసుకున్నాడు.

'రేపు మా పెద్దోడు పట్నం నుండి వస్తుండు. మా మనుమరాలు పుట్టినరోజు. ఈసారి ఇక్కడే చేయాల. నీ వంటల పనితనం చూపించాల. ఇద్దరు పాలేరోళ్ళు నీచేతి కిందే ఉంటారు. నువ్వేం ఫికర్ చేయకురా! ఎల్లుండి మబ్బున లేసి నాకాడకొచ్చేయ్ బస్!' అన్నారు మాజీ కరణంగారు.

సాంబయ్య సంతోషంగా తలూపాడు.

పెరట్లో జామచెట్టుకింద కట్టెలు కొడుతున్నాడు కరణంగారి పాలేరు రాములు . సాంబయ్య దృష్టి కట్టెల మీదకి మళ్ళింది.

'ఒరే రాములూ! ఆగరా!' కేకేశాడు సాంబయ్య. ఎందుకు కేకేశాడో రాములుకీ కరణంగారికీ అర్థంకాలేదు. సాంబయ్య గబగబా వెళ్ళి రాములు కొట్టబోయిన 'టేకు మొద్దు'ని పట్టుకొని కరణంగారి దగ్గరకి వచ్చాడు.

భుజమ్మీద కర్రమొద్దుని పసిపాపని ఎత్తుకున్నంత జాగ్రత్తగా పొదివి పట్టుకున్నాడు సాంబయ్య. కరణంగారితో అన్నాడు. 'ఏందయ్యా! ఇంత మంచి మొద్దుని పొయ్యిలకు పెడతరా?' 'ఆ, అసుంటివి మస్తు. చెదలు పట్టిపోతుం డయ్. ఏంజెయ్యమంటవ్' యధాలాపంగా అన్నారు కరణంగారు.

సాంబయ్య ఆ టేకుమొద్దుని ఎంతో ఆప్యాయంగా నిమురుతున్నాడు.

'ఏందిరా పిసోడా? నీగ్గావాలేందిరా ఆ కర్రమొద్దు తీస్కపో' నవ్వుతూ అన్నారు కరణంగారు.

సాంబయ్య ఉత్సాహంగా లేచాడు. ఆ టేకు కర్రమొద్దును భుజానేసుకుని ఇంటికొచ్చాడు.

★ ★ ★

ఆరోజు రాత్రి సాంబయ్య సగం రాత్రి దాకా మేలుకొని తన శిష్యులిద్దర్నీ పిలిపించుకొని పాత పనిముట్లన్నింటికీ పని కల్పించి, ఆ 'టేకు మొద్దు'ని ఒక పద్ధతికి తీసుకు రావటానికి ప్రయాసపడ్డాడు.

మర్నాడు ఉదయమే లేచి, మళ్ళీ ఆ కట్టెతో కుస్తీ పట్టటం ప్రారంభించాడు. వృత్తిపనికి మళ్ళీ జీవం వచ్చిందేమోనని ముసల్ది మురిసిపోయింది.

"ఏందయ్యో! కరణం నీకు గిదే పనెప్పిండేమి? ఏం జేస్కరమ్మన్నడు? బువ్వసుక తినద్దన్నడేంది?"

ముసల్దాని ముసిముసి నవ్వుల మాటల్లో గడుసు దనం. సాంబయ్య మాటలు రాని మర్మయోగిలా తనపని తాను చకచకా చేసుకుపోతున్నాడు.

మధ్యలో రెండుసార్లు ముసలమ్మ గొణిగింది. ఆ తర్వాత దగ్గుతూ నిదరోయింది.

ఓ గంట కునుకు తీశాడో లేదో సాంబయ్య మళ్ళీ తనపని మొదలెట్టాడు. ఎట్టకేలకు తెలతెలవారుతుండే సమయానికి అనుకున్నది సాధించానన్న విజయగర్వంతో సాంబయ్య తృప్తిగా నవ్వుకున్నాడు.

ముసలమ్మ ఇంకా ముక్కుతూ, మూలుగుతూ మంచం మీంచి లేవలేదు.

సాంబయ్య తన కాలకృత్యాలు తీర్చుకొని రెట్టించిన ఉత్సాహంతో కరణంగారింటికి బయల్దేరాడు.

సాయంత్రం నాలుగ్గంటల కల్లా వంటలన్నీ వండే శాడు.

అలసిపోయాడు. జామ చెట్టుకింద కునుకుతీశాడు. మా చెడ్డ నిద్దర పట్టేసింది సాంబయ్యకి.

'తాతా! లే. నా పుట్టినరోజు స్వీట్ తీస్కో

కళ్ళు తెరిచి చూశాడు సాంబయ్య. ఎదురుగా




కెంచు చిన్నన్న , చిన్న మెట్ పల్లి (పోస్ట్), కోరుట్ల (మం.),కరీంనగర్(జిల్లా)- 505 453

కరణంగారి మనవరాలు ఎనిమిదేళ్ళ స్రవంతి.

పిండారబోసినట్లు పండు వెన్నెల. వెన్నెట్లో స్రవంతి. పుత్తడి బొమ్మలా ఉంది. పక్కనే కరణంగారూ, ఆయన కొడుకూ కోడలున్నారు.

'వంటలు బ్రాగా కుదిరాయిరా సాంబా!' అనీ కరణం గారంటే...

'కోడి పులావ్వూ, కుర్మా, ఫ్రై అన్నీ బావున్నాయి'అని వాళ్ళబ్బాయన్నాడు.

'జిలేబీ, మైసూర్‌పాక్ బాగా కుదిరాయి సాంబయ్యా, అందరూ మెచ్చుకున్నారు' అంది కోడలు.

'అతిథులందరూ వెళ్ళిపోయారు. అప్పటినుండీ నువ్ కన్పించకుంటే ఎక్కడపోయావనుకున్నా? భోజనానికి రా!' ఆప్యాయంగా అన్నారు కరణంగారు.

సాంబయ్య ఒళ్ళంతా దులుపుకొని, పరచుకొన్న తలపాగా గుడ్డని దులుపుకొని గడ్డివాముపైపు నడవ సాగాడు.

'తాతా! నీకు నిద్దరమత్తుపోలేదా, అటు కాదు ఇటూ ' పకపకా నవ్వుతూ అంది స్రవంతి.

అలాగే వస్తున్నానన్నట్టుగా చేయ్యూపి... ఉదయం తాను ఎవరికంటాపడకుండా తలపాగాలో పెట్టుకొని తెచ్చి, గడ్డివాములో దాచిపెట్టిన ఓ వస్తువుని పట్టుకొచ్చాడు. అందరూ ఆశ్చర్యంగా సాంబయ్యానే చూస్తోంటే, అతడు స్రవంతిని ఎత్తి భుజమ్మీద వేస్కుని మరోచేత్తో ఆ వస్తువుని పట్టుకొని ఇంట్లో కొచ్చాడు. ఆ పిల్ల కాస్త బిడియమూ, నవ్వూ కలబోసి 'దింపు తాతా దింపు' అన్నా వినలేదు.

కుర్చీలో స్రవంతిని కూర్చోబెట్టాడు సాంబయ్య. కుటుంబ సభ్యులందరూ చుట్టూ చేరారు. సాంబయ్య రెండు చేతుల్లో ఆ వస్తువుని పొదివి పట్టుకొని చిన్నారి స్రవంతి చేతుల్లో పెడ్తూ.

' నా మనవరాలికి... పుట్టిన్రోజుకి ఈ ముసలి తాత ఇత్తున్న బవుమతి.' అన్నాడు.

'ఆ టేకు కట్టెతో నీవు రెండు రాత్రులూ శ్రమించి మన చిన్నారి స్రవంతికోసం ఇంత శ్రమపడ్డావా?'

సాంబయ్య భుజం ఆప్యాయంగా నిమురుతూ కరణం అన్నారు. సాంబయ్య కళ్ళు చెమర్చాయి.

'ఏంటి తాతా ఇది? పెట్టెలా ఉందీ...' అంది స్రవంతి కుతూహలంగా.

పెట్టె తెరచి చూపించారు కరణంగారు.


'ఓ మేకప్ బాక్స్, వెరీనైస్' అంది ఆ చిన్నారి. వాటర్థం సాంబయ్యకి తెలీకపోయినా ఆ మాటల్లోని మెచ్చుకోలు అంతరార్థాన్ని గ్రహించి ఉత్సాహంగా పెట్టెలో చూపిస్తూ' ఈడ ఓ అద్దం పెడితే సరిపోద్ది' అన్నాడు. సంతోషంతో మెరిశాయి స్రవంతి కళ్ళు.

ఒకప్పటి రాచరికపు నగిషీతో, అందమైన పసితనంతో సాంబయ్య చేతిలో మలచబడి, జీవకళ వొలుకుతున్న ఆ 'బొట్టుపెట్టె' కూడా మిలమిలా మెరిసిపోయింది.

తన వంటలపని తనాన్ని ఎందరు మెచ్చుకున్నా తృప్తిపడని సాంబయ్య స్రవంతి చేతిలో బొట్టుపెట్టెనీ, దాన్ని చూసుకొని మురిసిపోతున్న ఆ చిన్నారినీ తన పనితనాన్ని చూపులతోనే మెచ్చుకుంటున్న కరణంగారూ, ఆయన కుటుంబ సభ్యుల్నీ చూసి హృదయపూర్వకంగా హాయిగా, తృప్తిగా ఫీలయ్యాడు.

తను అంత అందంగా 'బొట్టుపెట్టె'ను మలచ గలిగాను అని తన వృత్తిపనికి తానే ఆశ్చర్యపోతోన్న సాంబయ్య కళ్ళు కూడా ఆ బొట్టుపెట్టెలా మిలమిలా మెరిసిపోయాయి.

✪



పి.ఎల్. రాధాకుమార్, విజయ పబ్లిక్ స్కూల్, నిజామాబాద్.